## తిండి బోతైన భర్తను ఆ భార్య ఎలా మార్చుకుంది?

# ఆంక్ష

రతన్ బాబు కథ

ఆ రోజు—

"బుచ్చిబాబు సెలవు పెట్టాడట"

ఎవరో అన్నారు డైనింగ్ హాల్లో –

మా ఫ్యాక్టరీ ఎడ్మినిస్ట్రేటీవ్ స్టాఫ్ ఎనమండుగురిలోనూ, ఆ రోజు బుచ్చిబాబు తక్కువ. మిగిలిన ఏడుగురం వున్నాం. క్యారేజీలు టేబులు మీద తెరచుకొని కూర్చున్నాం. మా మధ్య బుచ్చిబాబు లేకపోవడం వెలితిగానే వుంది. బుచ్చిబాబు మా మధ్య సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్.

బుచ్చిబాబు మాలోకల్లా యువకుడు. వయస్సు 26కు మించి వుండవు. సంవత్సరం క్రిందటే పెళ్ళయింది. బరువు 90 కేజీలకు పైగా వుంటాడు. చీకూ—చింతాలేని మనిషి. మంచివాడుగా అభిమానిస్తాం.

"తిండి గలిగితే కండగలదోయ్! కండగలవాడును మనిషోయ్!" అన్నట్టు బుచ్చిబాబు కండపుష్టి, తిండిపుష్టి దండిగా వున్న మనిషి.

"లివ్ టూ ఈట్టా! లేక ఈట్టూ లివ్వా!!" అని ప్రశ్నిస్తే నిష్కర్షగా "ఈట్ టూ లివ్" అన్నదే తన ఆశయమని చెప్పగల పుణ్య పురుషుడు మా బుచ్చిబాబు.

యింట్లో బుచ్చిబాబు శ్రీమతి అతని భోజన ప్రియత్వానికి అడుగడుగునా ఆంక్షలు పెడుతుందట. పాలు, పెరుగు, నెయ్యి అధికంగా వాడితే క్లాటు పెరిగిపోతుందనీ, నాన్ విజిటేరియన్, మషాళాలు అధికంగా తింటే బి.పి., హార్టు కంప్లైంట్ లాంటి వ్యాధులు వస్తాయనీ, దుంపకూరలు, యిడ్లీలు మరీ అధికంగా తింటే షుగర్ వస్తుందనీ, కారం, పులుపు తింటే అల్సర్



వస్తుందని, వయస్సు మించిన బరువుండడం కూడా ఓ జబ్బేనని ఏకరవు పెట్టి తిండి తిననివ్వకుండా వేదిస్తుందట. బుచ్చిబాబు భార్య చదువుకున్నది తెలివైనదే అన్న విషయం మా అందరికీ తెలిసినదే.

బుచ్చిబాబు యింట్లో పరిస్థితి విన్నమీద ట మేమంతా మా అందరి కారేజీలలోను బుచ్చిబాబుకు ప్రత్యేకంగా ఓ వాటా

కేటాయిస్తుంటాం. కుంతీదేవి భీముడికి వాటా కేటాయించినట్టుగా! ఎవరి యింట్లో ఏ వంటకం బావుంటుందో బుచ్చిబాబు చెప్పగలడు. శర్మగారి భార్య చేసే పులిహోర కమ్మదనం గురించి, ఆచారిగారి భార్య చేసే చక్కెర పొంగలి తియ్యదనం గురించి, నా భార్య చేసే బిర్యాని ప్రవీణ్యం గురించి చక్కగా తెలుసు. బుచ్చిబాబు మెప్పుకోసం మా శ్రీమతులు తమ పాకశాస్త్ర ప్రజ్ఞాప్రావీణ్యం ప్రదర్శిస్తే, మేమంతా పోటీ పడి మా కారేజీలలో అదనపుభాగం కేటాయించి బుచ్చిబాబు చేత తినిపించి ఆనందపడుతుంటాం. భోజనం అంటే ఏదో తప్పనిసరి కార్యక్రమంగా బావించే నాకు బుచ్చిబాబును చూసిన తరువాత భోజనం మీద , బుచ్చిబాబు ఆప్యాయత బాగా పెరిగిపోయింది. నేను కూడా ఈ మధ్య కాస్త వళ్ళు చేసానట! మా శ్రీమతి చెప్పింది. అన్ని కారేజీలు తిన్నా మళ్ళీ అరగంట గడిచే సరికల్లా క్యాంటిన్‌లోకి టిఫెన్‌కి పరుగు పెడతాడు బుచ్చిబాబు. అతని జఠరాగ్నిచూసి నాకు ముచ్చటేస్తుంది.

బుచ్చిబాబు సెలవు పెట్టడట! కారణం ఏమిటో! మాకందరికీ అదోలా వుంది. ఏదో భోజనాలు పూర్తి చేశాం. బుచ్చిబాబు లేని భోజనం, భోజనంలా లేదు. మా క్యారేజీలన్నీ బరువుగా ప్రక్కన పెట్టాం.

వరుసగా వారంరోజులు బుచ్చిబాబు ఫ్యాక్టరీకి రాకపోవడానికి కారణం ఏమిటో తెలియలేదు. ఎవరితోనూ మాట మాత్రంగానైనా చెప్పకుండా ఎక్కడికిపోయాడో, ఏమై వుంటాడోనన్న అనుమానంతో ఆరోజు బుచ్చిబాబు యింటికి బయలుదేరాను.

నేను వెళ్ళే సరికి బుచ్చిబాబు యింటిదగ్గరే వున్నాడు. మనిషి చిక్కి సగమైపోయాడు. గడ్డం పెరిగి వుంది . కళ్ళు లోతుకు పోయాయి. గాలి తీసిన బెలూన్‌లా వున్నాడు. నన్ను చూసి జీవంలేని నవ్వు నవ్వాడు.

''వంట్లో బావుండలేదా?'' అన్నాను. ఆత్రంగా దగ్గరకు వెడుతూ. అతని కళ్ళనుంచి నీళ్ళు వుబికి వస్తున్నాయి. ఏదో చెప్పాలనుకొంటున్నాడు. చెప్పలేకపోతున్నాడు. ఎప్పుడూ నవ్వుతూ, తుళ్ళుతూ నిశ్చింతగా వుండే బుచ్చిబాబు దిగులుగా వుండడం కళ్ళనీళ్ళు పెట్టడం నా మనస్సును కలచివేసింది. ''ఏమైంది! బుచ్చీ!'' అన్నాను ఆప్యాయంగా బుజంమీద చెయ్యివేసి. బుచ్చిబాబు బర్‌స్టయిపోయాడు. నెమ్మదిగా లేచి అల్మారాలోంచి ఓ లెటరు తీసుకువచ్చి నా ముందుంచాడు.

శ్రీ బుచ్చిబాబు గారికి

మీకు తిండి యావ తప్ప మరే విషయం పట్టదు. అది మీ ఆరోగ్యానికి మంచిదికాదని నేను పదే పదే చెప్పిన హెచ్చరికలేవీ మీరు పట్టించుకోవడంలేదు. మితిలేని మీ తిండివల్ల మీ ఆకారం ఎంత భయంకరంగా తయారయ్యిందో మీకు తెలియడం లేదు. మీతో కలిసి నలుగురిలోకి వెళ్ళడానికి నేనెంత సిగ్గుపడవలసి వస్తోందో మీకు తెలియదు. నేను సిగ్గు పడేది మీ ఆకారానికి మాత్రమే కాదు మీ ప్రవర్తనకు కూడా.

మీతో సినిమాకు వెడితే మీరు వేసేది ఏమిటి? యింటర్‌వెల్‌లో నన్ను హాల్లో ఒంటరిగా విడచి బయటకు వెళ్ళి మిరపకాయబజ్జీలు, కారపు సెనగలు, పెడతకింద పప్పు, వెరుసెనగ గుళ్ళులాంటివి డజనుకు పైగా పొట్లాలు తెచ్చుకొని సినిమా పూర్తి అయ్యేవరకూ తింటూ కూర్చుంటారు. అలానే బస్, లేదా ట్రైన్ ప్రయాణం మీతో చెయ్యవలసి వచ్చినా నరకమే. అక్కడకు అమ్మకానికి వచ్చిన తేగలు, మొక్కజొన్న పొత్తులు, అరటి, జామి, బత్తాయి, నారింజ లాంటి పళ్ళు, జంతికలు, చేగోడీలు లాంటి చెత్త అంతా కొనేసి దిగేవరకూ తింటూ కూర్చుంటారు. తిండి ధ్యాస తప్ప మీకు మరో ధ్యాస వుండదు. చుట్టూ వున్న వాళ్ళంతా మిమ్మల్ని మీ తిండిని చూసి నవ్వుకొంటున్నా మీకు చీమకుట్టినట్టుగా కూడా వుండదు. ఈ మధ్య మీరు ఫ్యాక్టరీలో అందరి క్యారేజీలలో మిగుళ్ళు కూడా బొంచేస్తున్న విషయం కూడా తెలిసింది. పెళ్ళికి ముందు నేను కన్న కలలన్నీ సంవత్సర కాలంలోనే కరిగిపోయాయి. మీలాంటి తిండి మనిషితో కాపురం చెయ్యడం యిక నావల్లగాదు.


ఈ రోజే మా పుట్టింటికి వెడుతున్నాను. నా చదువు నా పోషణకు సరిపోయే చిన్నపాటి ఉద్యోగం ఏదో ఒకటి యివ్వకపోదు. నా బ్రతుకు నేను బ్రతకడానికి నిర్ణయించుకున్నాను. మనం సామరస్యంగా విడిపోదాం. దయచేసి ఏ విధమైన అభ్యంతరాలు లేవదీయక మన విడాకులకు సహకరించగలరని విశ్వసిస్తున్నాను.

ఇట్లు

మిమ్మల్ని కట్టుకున్న నిర్భాగ్యురాలు

విమల

లెటరు పూర్తిగా చదివేసరికి విమల చేసిన పని న్యాయమైనదే అనిపించింది. బుచ్చిబాబు వైపు చూశాను. సర్వం



పోగొట్టుకున్న వాడులావున్నాడు. అతనికి ఎలా ఊరట కలిగించాలో నాకర్థం కాలేదు. నన్ను సహాయం చెయ్యమని ప్రాధేయపడ్డాడు. విమల లేకుండా తాను బ్రతకలేనన్నాడు. విమల కోసం పూర్తిగా భోజనం మానివేయ వలసి వచ్చినా వెనుకాడనన్నాడు. ఎలా అయినా కాపురం నిలబెట్టమని కోరాడు. బుచ్చిబాబు తిండికన్నా ప్రియమైన విషయం మరొకటి వుందని తొలిసారిగా తెలిసి ఆశ్చర్యంగానూ, వింతగానూ కూడా అనిపించింది నాకు.

బుచ్చిబాబు యిచ్చిన హామీ మీద నాకు విమలతో మాట్లాడి వాళ్ళిద్దరి మధ్యా సయోధ్యకుదిరిస్తే కాపురం చక్కమడుతుందేమోనన్న ఆశ కలిగింది. వాళ్ళ మామగారి చిరునామా తీసుకుని ఆ రోజే ప్రయాణమయ్యాను.

బుచ్చిబాబు మామగారి యిల్లు తేలికగానే పట్టుకో గలిగాను. వాకిట్లోనే విమల ఎదురుగా వచ్చింది. ''బావున్నారా! అన్నయ్యగారూ!'' అంటూ. విమలతో బుచ్చిబాబు పరిస్థితి గురించి చెప్పాను. అతని నిర్ణయం గురించి కూడా చెప్పాను.

''నిజంగా ఆయనలో అంత మార్పు వచ్చిందా? అన్నయ్యగారూ!'' అంది నమ్మలేనట్టుగా.

మొసలి నోట బడ్డ గజేంద్రుడిలా వున్న బుచ్చిబాబు పరిస్థితిని ఆమెకు కళ్ళు కట్టినట్టుగా వివరించి నా వెంట ప్రయాణమవ్వమని కోరాను.

విమల అందుకు అంగీకరించలేదు. బుచ్చిబాబును ఏదైనా 'ప్రకృతి ఆశ్రమం' లో చేర్చి అతని వయస్సుకు, ఎత్తుకు, ఎంత బరువు వుండాలో అంతే బరువుండేలా ట్రీట్‌మెంట్ తీసుకొన్న తరువాతనే బుచ్చిబాబుతో కాపురం చెయ్యగలనని నిర్బంధంగా చెప్పేసింది. ఆ అవకాశమే బుచ్చిబాబుకి చాలని చెప్పి ఆనందంగా తిరిగి చక్కా వచ్చేసాను.

యిప్పుడు బుచ్చిబాబు ప్రకృతి ఆశ్రమంలో వున్నాడు. అతని బరువు 20 కేజీలు యింకా తగ్గవలసి వుంది. అతని లక్ష్యం విమలే గనుక ఆ బరువు నుండి అతను తేలిగ్గానే బయటపడతాడని నా నమ్మకం. విమల బుచ్చిబాబుకు పెట్టిన ఆంక్ష న్యాయమైనదే అనిపించింది.

●

